సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

విద్యా ప్రమాణాల పెంపుదలకు అందరూ సమన్వయంతో పని చేయాలని కేజీబీవీల రాష్ట్ర సెక్రటరీ, విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. -8లో



విశాఖ ఉక్కు.. మన హక్కు

విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ ఉద్యమం ఉధృతమైంది. ఇందుకోసం కమ్యూనిస్టులు కదం తొక్కారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనల్లో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టారు. -8లో

గరిష్టం/కనిష్టం
35.4/26.1

వాతావరణం

జిల్లాలో మంగళవారం 26.1 - 35.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలోని పలు మండలాల్లో వర్షం

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగా మంగళవారం తెల్లవారుజామున గోపవరంలో 6.6 మి.మీ వర్షం కురిసింది. అలాగే అట్లూరులో 5, బి. కొడూరులో 2.4, పెద్దయుడియంలో 1.8 మిల్లీమీటర్ల వర్షం నమోదయింది.

నేటి నుంచి ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నుంచి నెల రోజులపాటు టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు గల నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి శిక్షణ సమయంలో వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని వివరించారు. గ్రామీణ మహిళలకు శిక్షణలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 94409 33028, 94409 05478 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: వేంపల్లి పట్టణంలోని జెడ్పీహైస్కూల్ (బాలురు)లో గురువారం ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హరికృష్ణ, వి. లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారుల వయస్సు 15 ఏళ్లలోపు ఉండాలని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ తీసుకురావాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 20, 21 తేదీల్లో వేంపల్లిలో నిర్వహించే సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు.

జిల్లాకు యూరియా రాక



యూరియాను పరిశీలిస్తున్న డీఏఓ కార్యాలయ ఏవో గోవర్ధన్

కడప అగ్రికల్చర్: వైఎస్సార్‌జిల్లాకు బుధవారం 1320 టన్నుల యూరియా వచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో 930 టన్నులు వైఎస్సార్‌జిల్లాకు కేటాయించగా ఇందులో 530 టన్నులను ప్రైవేటు డీలర్లకు, మరో 400 టన్నులను మార్క్‌ఫెడ్‌ను కేటాయించినట్లు తెలిపారు. అలాగే మరో 390 టన్నులను అన్నమయ్య జిల్లాకు కేటాయించామని పేర్కొన్నారు. ఇందులో 130 టన్నులను ప్రైవేటు డీలర్లకు కేటాయించగా మరో 260 టన్నులను మార్క్‌ఫెడ్‌కు కేటాయించినట్లు నాగేశ్వర్ రావు తెలిపారు.

ఎంఎస్సీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎంఎస్సీ ఎర్త్ సైన్సెస్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలకు ఈనెల 11, 12 తేదీలలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 11, 12వ తేదీలోపు ఓఏఎండీసీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర సందేహాలకు 8985597928 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పీహెచ్‌సీ తనిఖీ



రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

పెండ్లిమర్రి: పెండ్లిమర్రి మండలంలోని నంది మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీలోని పలు రికార్డులను పరిశీలించారు. ఓపీ సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని ఫార్మసీ, నర్సింగ్ రూమ్, లేబర్ వార్డు, జనరల్ వార్డులను తనిఖీ చేశారు. స్టాఫ్ నర్స్ 24గంటలు అందుబాటులో ఉండి ఆసుపత్రిలోనే కాన్పులు అయ్యేలా చూడాలని వైద్యాధికారికి సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన భవనాన్ని వారం రోజుల లోపు హ్యాండ్ ఓవర్ చేసుకోవాలన్నారు. ప్రతినెల పీహెచ్‌సీలో దాదాపు పది కాన్పులు అయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఇంటింటా సౌర కాంతులు

సూర్యుడు ఉదయించకముందే ఇంటింటా సౌర కాంతులు వెదజల్లే సమయం వచ్చేసింది. పవర్ కట్.. లో ఓల్టేజీకి కాలం చెల్లే రోజు రానే వచ్చింది. అవును.. ఇంటింటా నిరంతర విద్యుత్ కాంతులతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను అమల్లోకి తెచ్చింది. దీనికి ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుండడంతో ఈ పథకాన్ని అనూహ్య స్పందన లభిస్తోంది.

- పీఎం సూర్య ఘర్‌తో నిరంతర వెలుగులు
- పవర్ కట్...లో ఓల్టేజీలకు చెక్
- సోలార్ ప్యానల్స్‌తో విద్యుత్ ఉత్పత్తి
- ఉమ్మడి జిల్లాలో 1569 దరఖాస్తులు



గృహాలపై వేసిన సోలార్ ప్యానళ్లు

సోలార్‌టాప్ సామర్థ్యం	ఉత్పత్తి అయ్యే యూనిట్లు (నెలకు)
1 కిలోవాట్	120
2 కిలోవాట్	240
3 కిలోవాట్	360

కడప కార్పొరేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులు సూర్య ఘర్ పథకంపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, రైల్వే గేట్లు, డివైడర్లు, అపార్ట్‌మెంట్ల వద్ద సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వినియోగిస్తున్నారు. 'సూర్య ఘర్' పథకం ద్వారా దేశ వ్యాప్తంగా కోటి కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రాయితీలు అందించి ప్రోత్సహిస్తోంది. కేవలం గృహ లబ్ధిదారులకు మాత్రమే రాయితీలు వర్తిస్తాయి.

ప్యానల్స్...నెట్ మీటర్ ఏర్పాటు ఇలా..

విద్యుత్ అధికారుల ఆమోదంతో ఆయా గృహాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. భవనం పైభాగంలో వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ అమరుస్తారు. ప్రస్తుతం వాడే విద్యుత్ మీటర్ స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేసి, దీని ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి వినియోగం లెక్కిస్తారు. అలాగే ఇంటికి సరిపడినదానికంటే ఎక్కువగా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తారు.

సులభంగా పెట్టుబడి వెనక్కి....

ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి సబ్సిడీ, బ్యాంకు రుణంతోపాటు పెట్టుబడి అంతా ఆరు లేదా ఏడేళ్లలో తిరిగి వచ్చే అవకాశముంది. సూర్య ఘర్ ప్యానల్స్ ఏర్పాటు చేసిన 30 రోజుల్లో వినియోగదారుల ఖాతాల్లో సబ్సిడీ జమ చేస్తారు. ముందుగా వినియోగదారులు తమ బ్యాంక్ ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 100 చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కిలోవాట్ సామర్థ్యం గల రూఫ్ టాప్‌కు మూడు లేదా నాలుగు ప్యానల్స్ వినియోగిస్తారు.



ఉమ్మడి జిల్లాలో 1569 దరఖాస్తులు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో సూర్య ఘర్ పథకం కోసం 1569 మంది ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 100 కిలోవాట్స్ విద్యుత్ ఉత్పత్తి జరిగేలా ఆయా దరఖాస్తుదారుల కిలోవాట్స్ వినియోగం ఉంటుంది. ఇప్పటి వరకూ పథకంలో భాగంగా 28 సోలార్ రూఫ్ టాప్‌లను ఆయా గృహాలు, అపార్ట్‌మెంట్ల వద్ద ఏర్పాటు చేశారు. మరో 31 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోగా, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంది.

పథకాన్ని పొందండిలా....

- పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పొందేందుకు గృహ విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు ఉండాలి
- ఈ పథకం కోసం మొబైల్‌లో సూర్య ఘర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులో వినియోగదారుడి వివరాలు నమోదు చేయాలి.
- ఆరునెలల విద్యుత్ బిల్లుల కాపీలను జత చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- రిజిస్ట్రేషన్ ఫీజు ఎన్ని కిలోవాట్స్ తీసుకుంటున్నామనే దాన్నిబట్టి ఉంటుంది.
- 5 కిలోవాట్స్‌కు రూ.1900, 5 వాట్స్ పైబడితే రూ.5900, 10 కిలోవాట్స్ పైబడిన హెచ్‌టీ సర్వీసుదారులు రూ.11800 చెల్లించాలి.
- 3 కిలోవాట్స్‌లోపు సర్వీసులకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ట్రాన్స్‌కో అనుమతులు పొందిన తర్వాత వెండర్లను ఎంపిక చేసుకోవాలి.
- కిలోవాట్స్‌ను బట్టి సబ్సిడీ మంజూరు చేస్తారు.

సోలార్ రూఫ్ టాప్ ఖర్చు.. విద్యుత్ ఉత్పత్తి ఇలా..

5 కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ అమర్చుకుంటే నెలకు 600 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఇందులో 300 యూనిట్లు ఇంటి అవసరాలకు పోతే మిగిలిన 300 యూనిట్లను విద్యుత్‌శాఖ యూనిట్‌ను రూ.3.741ల చొప్పున కొనుగోలు చేసి సదరు మొత్తాన్ని వినియోగదారుడి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. కాగా 3 కిలో వాట్ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ. 1,90,000లు, 5 కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ.2,90,000లు ఖర్చవుతుంది. 3 కిలో వాట్‌కు ప్రభుత్వం నుంచి రూ.78,000లు సబ్సిడీ లభిస్తుంది.



నెట్ మీటర్లు

సద్వినియోగం చేసుకోవాలి



సూర్య ఘర్ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకానికి వినియోగదారుల నుంచి స్పందన బాగుంది. సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్న వినియోగదారులు నిరంతరం విద్యుత్ పొందవచ్చు. పెట్టుబడి కూడా త్వరగానే వస్తుంది. మనకు సరిపోగా మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. రూఫ్ టాప్, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయవచ్చు. - ఎస్. రమణ, పర్యవేక్షక ఇంజినీరు, ఏపీఎస్‌పీడీసీఎల్, కడప

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- ఎన్‌జీవో కాలనీలోని వినాయకునికి ప్రత్యేక పూజలు



ఎన్‌జీవో కాలనీ వినాయకుడి సన్నిధిలో ఎంపీ, మేయర్, మాజీ ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న విగ్రహ కమిటీ సభ్యులు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులు వేసిన పంటలకు గిట్టుబాటు ధర రావాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలోని భారీ వినాయకుడిని ఆయన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గణేష్ విగ్రహ కమిటీ సభ్యులు వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాయలసీమలోనే అతిపెద్దదైన వినాయకుని విగ్రహాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున, మాజీ కార్పొరేటర్ ఏ.రాజగోపాల్‌రెడ్డి, మహేష్, షఫీవుల్లా, పులి సునీల్, కొండయ్య పాల్గొన్నారు.

షేక్ హుస్సేన్‌కు పరామర్శ

కడప నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్సీ షేక్ హుస్సేన్‌ను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

పోస్టాఫీసు నిర్మాణానికి ఎంపీ కృషి భేష్

కడప కార్పొరేషన్: శంకరాపురం పోస్టాఫీసు నూతన భవనం నిర్మాణానికి కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదని పోస్టల్ ఉద్యోగులు పేర్కొన్నారు. మంగళవారం పోస్టాఫీసుకు విచ్చేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలకు వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 1969లో హౌసబిల్డింగ్ సొసైటీ 8 సెంట్ల స్థలాన్ని పోస్టాఫీసుకు కేటాయించిందని, అందులో పోస్టాఫీసు భవనం నిర్మించేందుకు ఎవరూ చొరవ చూపలేదన్నారు. 2019లో 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున ద్వారా తాము ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా, ఆయన వెంటనే స్పందించి పోస్ట్‌మాస్టర్ జనరల్‌తో మాట్లాడి నూతన పోస్టాఫీసు నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరు చేయించారన్నారు. అనంతరం ఎంపీ పోస్టాఫీసులో కలియతిరిగి నిర్మాణాన్ని పరిశీలించారు.

జల్ జీవన్ లక్ష్యాన్ని సాధించాలి

- సమీక్షలో కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: జల్ జీవన్ మిషన్ లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి కనెక్షన్ సదుపాయం కల్పించడంతోపాటు వంద శాతం కుళాయి కనెక్షన్లను నిర్వహణలోకి తీసుకురావాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆర్‌డబ్ల్యూఎస్, పారిశుద్ధ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న శుద్ధ తాగునీటి సరఫరా పనుల పురోగతిపై ఆయా గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ ఇంజనీరింగ్ అధికారులు, సహాయకులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా శుద్ధ తాగునీటి సరఫరా అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కుళాయి కనెక్షన్లను పూర్తి స్థాయిలో నిర్వహణలోకి వచ్చేలా పనులను పూర్తి చేయాలన్నారు. క్రమం తప్పకుండా తాగునీటి నాణ్యతా పరీక్షలను నిర్వహించాలని క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, సీపీఓ వెంకటరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఏడుకొండలు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్.. కాలేదా!

- 2024-25 జిల్లా నామినేషన్ల లక్ష్యం 5000
- ఇప్పటి వరకు నమోదైన నామినేషన్లు కేవలం 70 మాత్రమే
- ఈ నెల 15 వరకు ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్లకు గడువు



తయారు చేసిన ప్రాజెక్టుతో విద్యార్థి (ఫైల్)




కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో శాస్త్రీయ సాంకేతికతను పెంచి భావి శాస్త్రవేత్తలను తయారు చేసేందుకు లభించే అరుదైన అవకాశంపై జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు స్కూల్స్ సైన్సు టీచర్లు ఆసక్తి చూపడం లేదు. ఇన్‌స్పైర్ మనాక్ కింద కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శాస్త్రీయ ప్రయోగ పోటీలకు జిల్లా నుంచి ఆశించిన మేర స్పందన కరువయింది. జిల్లావ్యాప్తంగా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 1015 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు కలుపుకుని ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టుల చొప్పున 5000 ప్రాజెక్టులను యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు జిల్లాలో కేవలం 14 పాఠశాలలకు సంబంధించి 70 ప్రాజెక్టులను మాత్రమే నమోదు చేశారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఇందులో భాగస్వాములు కావాల్సి ఉంది. ఆ దిశగా వారు అంతగా చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్ల నమోదు చేసుకునేందుకు సంబంధించిన గడువు ఈనెల 15వ తేదీ వరకు ఉంది. ఇన్‌స్పైర్ మనాక్‌పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నాం



ఇన్‌స్పైర్ మనాక్ కాంపిటీషన్‌పై జిల్లాలోని సైన్సు ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ మీటింగ్‌ల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. దీంతోపాటు యాప్‌కు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా నా దృష్టికి తీసుకురావాలని చెప్పాను. జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు సంబంధించి ప్రాజెక్టుల నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంది. ఇప్పటికైనా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తొందరపడాలి. - ఎబినైజర్, జిల్లా సైన్సు అధికారి

నిర్లక్ష్యం చేయడం తగదు...



ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్లకు సంబంధించి అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్పందించాలి. సైన్సు ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని నామినేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలి. ప్రతి పాఠశాల నుంచి తప్పని సరిగా ఐదు నామినేషన్లు వచ్చేలా చూడాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి లక్ష్యాన్ని పూర్తి చేయాలి. - మర్రెడ్డి అనూరాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

మహిళా డిగ్రీ కళాశాల.. 'సీమ'కే మకుటం

- రాయలసీమ స్థాయిలో ప్రథమస్థానం
- రాష్ట్ర స్థాయిలో 7వ, జాతీయస్థాయిలో 451వ స్థానం



ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు మరో అరుదైన గౌరవం దక్కింది. ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉన్నత విద్యారంగంలో విద్యార్థులకు అందిస్తున్న సేవలు, మౌలిక సదుపాయాలు, బోధన, స్కిల్స్, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ర్యాంకింగ్స్ ప్రకటించింది. ఇందులో స్వయం ప్రతిపత్తి కలిగిన మహిళా కళాశాలల విభాగంలో కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల రాయలసీమస్థాయిలో అగ్రస్థానంలో నిలిచింది. కో ఎడ్యుకేషన్ విభాగంలో అనంతపురం ఆర్ట్స్ కళాశాల ప్రథమస్థానంలో నిలవగా, కోటిరెడ్డి కళాశాల రాయలసీమ స్థాయిలో మహిళల విభాగంలో అగ్రస్థానంలో నిలిచింది. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో 7వ స్థానం, జాతీయస్థాయిలో 451వ స్థానంలో నిలిచి జిల్లాఖ్యాతిని చాటిచెప్పింది. 1973లో ఏర్పాటైన కళాశాల అంచెలంచెలుగా ఎదుగుతూ వేలాది మందికి విద్యాసుగంధాలు వెదజల్లుతోంది. తాజా ర్యాంకింగ్‌తో కళాశాల ప్రగతిసిగలో మరో మణిహారం చేరినట్లయింది.

చాలా సంతోషంగా ఉంది



ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ ఇచ్చిన సర్వేలో కళాశాల జాతీయ స్థాయిలో 451వ స్థానం, రాష్ట్రస్థాయిలో 7వ స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది. అధ్యాపకులు, విద్యార్థులందరి సమిష్టికృషితో రానున్న రోజుల్లో మరింత మెరుగైన ర్యాంకింగ్ సాధించేందుకు కృషిచేస్తాం. - డాక్టర్ వేముల సలీంబాషా, ప్రిన్సిపాల్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

చాపాడు: మండలంలోని చాపాడు, నక్కలదిన్నె గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీసు కోటా కుదిస్తూ తీసుకువచ్చిన జీఓ 85కు వ్యతిరేకంగా ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైనట్లు వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 16వ తేది వరకూ రోజు వారి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించటంతో పాటు జీఓ నెం.85ను రద్దు చేసే వరకూ తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. వైద్యాధికారులు కావ్యమాధురి, శ్రీవాణి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెబ్‌స్టేషన్‌లో కూలిన సన్‌సైడ్
– మహిళా కానిస్టేబుల్‌కు గాయాలు


కూలిన సన్‌సైడ్ పెచ్చులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక సెబ్ స్టేషన్‌లోని సన్‌సైడ్ ఒక్కసారిగా కుప్పకూలింది. భవనం పాతది కావడం వల్ల పెచ్చులు ఊడటంతోపాటు కొంత భాగం సన్‌సైడ్ కూలినట్లు సిబ్బంది చెబుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో మహిళా కానిస్టేబుల్ రమాదేవి బయటికి రాగా ఆమెపై పెచ్చులూడి పడ్డాయి. దీంతో కానిస్టేబుల్ కాలుకు స్వల్ప గాయాలయ్యాయి. భవనం రిపేరు చేయాలని పలుమార్లు యజమానికి చెప్పినట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా సిబ్బంది అంతా బయట సన్‌సైడ్ కింద కూర్చొని ఉంటారు. అయితే భోజన సమయం కావడంతో అందరూ ఆఫీసు లోపల ఉండిపోయారు. లేదంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని సిబ్బంది చెబుతున్నారు.

విజయవాడ వరద బాధితులకు విరాళం


రూ.5 లక్షల చెక్కును క్రిష్ణారెడ్డికి అందజేస్తున్న దేవునికడప, పాతకడప నివాసులు

కడప కార్పొరేషన్ : విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి తిరుమల తొలి గడప దేవునికడప, పాతకడప నివాసులు రూ.5 లక్షల విరాళం ఇచ్చారు. మంగళవారం ఈ చెక్కును క్లస్టర్ యూనిట్ ప్రెసిడెంట్, పాతకడప మాజీ సర్పంచ్ క్రిష్ణారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చైతన్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ వ్యాన్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కదిరివారం పల్లె క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం స్కూల్ వ్యాన్ ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. కర్నూలు జిల్లా అవుకు గ్రామానికి చెందిన శివన్న బైక్‌లో వస్తుండగా.. ఎదురుగా వస్తున్న ఎర్రగుంట్ల జీవీఎస్ జ్యోతి హైస్కూల్ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శివన్నకు గాయాలు అయ్యాయి. అతన్ని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ప్రొద్దుటూరు ఎంవీఐ నారాయణ నాయక్, పోలీసులు పరిశీలించారు.

కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్‌సెల్ సమయంలో తలకు పూసుకునే రంగును సేవించి ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన స్టాఫ్ నర్స్ బి. చిన్నమ్మ పై మంగళవారం కడప ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్నమ్మ తనను డాక్టర్ చెన్న కృష్ణ ప్రేమపెళ్లి చేసుకుని మోసం చేశాడనీ ఆరోపిస్తూ ఫిర్యాదు చేసేందుకు వచ్చింది. ఈక్రమంలోనే బలవన్మరణానికి ప్రయత్నం చేసిన ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప ఒన్‌టౌన్ పోలీసులు తెలియజేశారు.

ఉరి వేసుకుని బాలిక మృతి


మృతి చెందిన మాధవి

కాశినాయన : మండలంలోని కొండ్రాజుపల్లె గ్రామానికి చెందిన కత్తెర గండ్లమాధవి (14) అనే బాలిక మంగళవారం ఉరి వేసుకుని మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మాధవి 8వ తరగతి చదువుతుండేది. కడుపునొప్పిగా ఉందని చెప్పి ఇంటికి వచ్చింది. కడుపునొప్పి బాధ భరించలేక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గత మూడు సంవత్సరాల క్రితం మృతురాలి తండ్రి చెన్నయ్య అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ హనుమంతు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశాడు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విశాఖ ఉక్కు.. మన హక్కు


కడపలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకుల ధర్నా


ప్రొద్దుటూరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..


కమలాపురంలో డీటీకి వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు


జమ్మలమడుగులో ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ ఉద్యమం ఉద్ధృతమైంది. ఇందుకోసం కమ్యూనిస్టులు కదం తొక్కారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనల్లో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టారు. విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు అని నినదించారు. ఈ పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు చేస్తున్న ప్రయత్నం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పరం కాకుండా అడ్డుకుంటామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీలు గుప్పించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు అయినా ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగామన్నారు. రాష్ట్రానికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్ ఆధ్వర్యంలో నడపాలని డిమాండ్ చేశారు. – ప్రొద్దుటూరు/కడప సెవెన్‌రోడ్స్/కమలాపురం/జమ్మలమడుగు

జిల్లా వ్యాప్తంగా పోలీసుల దాడులు


ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు

కడప అర్బన్ : జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల్లో పలు నేరాలపై ముమ్మరంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గంజాయి విక్రయాలు, గ్యాంబ్లింగ్, మట్కా నిర్వహణ, ఇసుక అక్రమ రవాణా, అక్రమమద్యంపై దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ వివరాలపై జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

- బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై 610 మందిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ మద్యపానం జరిగే ప్రదేశాలను గుర్తించి మునిసిపల్, పంచాయతీ, అధికారుల సమన్వయంతో శుభ్రం చేశారు. పాఠశాలల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించి అల్లరి మూకల అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు కృషి చేస్తున్నారు.
- హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 1084 మందిపై ఎం.వి యాక్ట్ కేసులు నమోదు చేశారు. వారికి మొత్తం రూ.1,46,340 జరిమానా విధించారు.
- గంజాయి విక్రయాలపై 8 కేసులు నమోదు చేసి, 4.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేశారు.
- 17 కేసుల్లో 102 మంది జూదరులను అరెస్ట్ చేసి రూ.9200 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- 20 మంది మట్కా నిర్వాహకులను అరెస్ట్ చేసి, రూ.3,15,250 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న 24 మందిని అరెస్ట్ చేసి 11 కేసులు నమోదు చేశారు. 106 టన్నుల ఇసుక, తరలిస్తున్న 19 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.
- అక్రమ మద్యం విక్రయాలు, రవాణాపై దాడులు నిర్వహించి 23.43 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. 9 కేసుల్లో 9 మందిని అరెస్ట్ చేశారు.
- జిల్లా వ్యాప్తంగా 31 కేసుల్లో 158 మందిని బైండోవర్ చేశారు. 59 మంది రౌడీషీటర్లను సత్ప్రవర్తనతో జీవించాలని పోలీసు అధికారులు హెచ్చరిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు.
- అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ప్రజలు తమ వంతు సామాజిక బాధ్యతగా పోలీసుశాఖకు సహకరించాలని, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, ఇతర నేరాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100కు తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా వుంచుతామని ఎస్పీ తెలిపారు.

వింత ఆకారంలో మేకపిల్ల జననం



సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామంలో వడ్డే శ్రీనివాసులుకు మేకల మంద ఉంది. అందులో ఒక మేక రెండు పిల్లలకు మంగళవారం జన్మనిచ్చింది. అందులో ఒకటి వింత ఆకారంలో జన్మించింది. దీంతో ఆ గ్రామ ప్రజలతోపాటు చుట్టు పక్కల గ్రామాల వారు తరలివచ్చి చూసి ఆ మేక పిల్లను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తల భాగంలో ఒకే ఒక కన్ను అది నుదుటి భాగంలో... ముక్కు తొండం లాగా ఉంది. ఇది జన్యుపరమైన లోపాలతో జన్మించినట్లు పశువైద్యులు తెలిపారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి

చక్రాయపేట : మండలంలోని నెరుసుపల్లె గ్రామం దేవరగుట్టపల్లె దళితవాడలో ఊర కుక్కలు స్వైర విహారం చేశాయి. గ్రామానికి చెందిన వెంకట కొండయ్యకు చెందిన గొర్రెల మందపై దాడి చేయడంతో 20 గొర్రెలు మృతి చెందాయి. దీంతో రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరాడు. గ్రామంలో ఊర కుక్కలు ఎక్కువయ్యాయని చెప్పాడు. వాటిని అరికట్టాలని డిమాండ్ చేశాడు.

ఆధిక్యంలో 'అనంత' జట్టు


121 పరుగులు చేసిన శశాంక్ శ్రీవత్స


6 వికెట్లు తీసిన నెల్లూరు బౌలర్ సల్మాన్


5 వికెట్లు తీసిన అనంత బౌలర్ దీపక్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–23 మల్టీడేస్ క్రికెట్ పోటీల్లో అనంతపురం జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో రెండోరోజు చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 56.4 ఓవర్లలో 278 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని శశాంక్ శ్రీవత్స 118 బంతుల్లో 121 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు దీపక్ 5, లోహిత్‌సాయి 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 35 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. జట్టులోని అర్జున్ టెండూల్కర్ 66 పరుగులు, యోగానంద 61 పరుగులు చేశారు. కాగా అనంత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి అనంతపురం జట్టు 185 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

ఆధిక్యంలో కడప జట్టు..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 102 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 78.4 ఓవర్లలో 340 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నిఖిలేశ్వర్‌రెడ్డి 76 పరుగులు, సుబ్రమణ్యం 96 పరుగులు చేశారు. కడప బౌలర్లు వరుణ్‌తేజారెడ్డి 4 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 30.4 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. జట్టులోని జాఫర్ అలీఖాన్ 57 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ సల్మాన్ 6 వికెట్లు తీశాడు. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 222 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి కడప జట్టు 50 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

బియ్యం లారీ పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

ఖాజీపేట : సాధారణంగా మనకు ఏదైనా అక్రమ రవాణా జరుగుతోందని తెలిసినప్పుడు పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టిస్తాం.. లేకపోతే సంబంధిత శాఖ వారికి ఫిర్యాదు చేస్తాం.. కానీ ఏకంగా లారీని వెంబడించి అడ్డుకుని వారితో గొడవ పడి బ్లాక్‌మెయిల్‌కు దిగిన సంఘటన తీవ్ర సంచలనంగా మారింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట మండల పరిధిలోని జాతీయ రహదారిపై బియ్యం లోడ్‌తో లారీ సోమవారం అర్ధరాత్రి సమయంలో వెళ్తోంది. దానిని కొందరు వ్యక్తులు నాలుగు కార్లలో వచ్చి అటకాయించారు. ఆ లారీ ఆగడంతో.. వారు డ్రైవర్‌ను ఎక్కడ నుంచి బియ్యం వస్తోంది.. ఎవరివి అంటూ ప్రశ్నించారు. ఇంతలో అటుగా వెళ్తున్న ఖాజీపేట సీఐ మోహన్ అక్కడ ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగిందేమోనని పరిశీలనకు వెళ్లారు. లారీలో చౌక బియ్యం రవాణా అవుతోందని అందుకే అడ్డుకున్నాం అన్నట్లు వారు సమాధానం చెప్పారు. దీంతో సమస్యకు కారణమైన లారీని స్వాధీనం చేసుకుని అక్కడి నుంచి అందరిని పంపించి వేశారు.

చౌక బియ్యమా, కాదా తేల్చండి

లారీలో ఏముందని సీఐ తన సిబ్బందితో వెళ్లి మంగళవారం ఉదయం పరిశీలించారు. బియ్యం బస్తాలు ఉండటం గమనించారు. అయితే అవి చౌక బియ్యమా కాదా అన్న విషయంపై తేల్చడానికి తహసీల్దార్‌కు అప్పగించారు. తహసీల్దార్ సరస్వతి పరిశీలనకు పంపించారు.

రికార్డులు ఉన్నాయి

లారీలోని బియ్యంకు అన్ని రికార్డులు ఉన్నాయి. టెండర్ల ద్వారా వచ్చిన బియ్యంను తూముకూరుకు పంపిస్తున్నాం. కొందరు వ్యక్తులు లారీని ఆపి డ్రైవర్‌ను దుర్భాషలాడారు. డబ్బులు ఇవ్వాలంటూ నన్ను బ్లాక్‌మెయిల్ చేశారు. బియ్యం పరిశీలనకు పంపించి చౌక బియ్యం అయితే కఠిన చర్యలు తీసుకోవచ్చు. – సూరిశెట్టి ప్రసాద్, శ్రీశైలం బోర్డు మాజీ సభ్యుడు

చేనేత, సిల్క్ ఉత్పత్తుల అమ్మకాలకు ప్రోత్సాహం

రాయచోటి (జగదాంబసెంటర్) : చేనేత, సిల్క్ ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించేందుకు చేనేత జౌళి శాఖ మంగళగిరి వారి ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీలలో విజయవాడలోని శేష సాయి కల్యాణ మండపం ఎంజీ రోడ్డులో బయ్యర్స్, సెల్లర్స్ మీట్ నిర్వహిస్తున్నారని అన్నమయ్య జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి యు.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి చేనేత సిల్క్ సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్, చేనేత కళాకారుల ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు. వస్త్ర వ్యాపారులు, షాపింగ్ మాల్స్ యజమానులు, టెంపుల్ సప్లయర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు సమష్టి కృషి


మాట్లాడుతున్న విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ మధుసూదన్‌రావు

కడప ఎడ్యుకేషన్ : విద్యా ప్రమాణాల పెంపుదలకు అందరూ సమన్వయంతో పని చేయాలని కేజీబీవీల రాష్ట్ర సెక్రటరీ, విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. కడప కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో మంగళవారం వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల డీఈఓలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓ–1,2లతోపాటు సమగ్రశిక్ష సెక్టోరియల్ ఆఫీసర్స్‌కు ఎడ్యుకేషన్ యాక్టివిటీస్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని వైఎస్సార్ జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కేజీబీవీల సెక్రటరీ, విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ ఈ. మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఈ వారమంతా యూడైస్ పూర్తి చేయడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాలల డేటాను పూర్తి చేయడంతోపాటు డ్రాపౌట్స్‌ను క్లియర్ చేయాలని ఆదేశించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం బడి ఈడు వయసున్న ప్రతి విద్యార్థి పాఠశాలల్లో ఉండేందుకు విద్యాశాఖలోని అనుబంధ సంస్థలతో కలసి పని చేయాలన్నారు. డీఈఓ మర్రెడ్డి అనురాధ మాట్లాడుతూ ప్రభుత్వంతోపాటు ఇతర యాజమాన్యాల విద్యార్థులందరికీ వసతులు కల్పించడంతోపాటు నాణ్యమైన విద్య అందించాలన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులకు తప్పనిసరిగా అడ్మిషన్ ఇవ్వాలని ఆదేశించారు. లేనిపక్షంలో ఆయా పాఠశాలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వైఎస్సార్ జిల్లా డీఈఓ మర్రెడ్డి అనురాధ, అన్నమయ్య డీఈఓ ప్రకాశ్‌రెడ్డిలు వారి జిల్లాలలో విద్యాపరమైన ప్రగతిని తెలియజేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప, ప్రొద్దుటూరు, మదనపల్లి డిప్యూటీ డీఈఓలు రాజగోపాల్‌రెడ్డి, క్రిష్టఫర్, పురుషోత్తం, కడప డీఈఓ కార్యాలయం ఏడీ మునీర్ ఖాన్, అన్నమయ్య జిల్లా ఏడీ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లంబోదరుడి లడ్డూ అధరహో

లంబోదరుడి లడ్డూ ప్రసాదానికి యమ డిమాండ్ ఉంది. రూ.లక్షల్లో ధర పలుకుతోంది. వినాయక చవితి ఉత్సవాల్లో నాలుగో రోజైన మంగళవారం భారీగా వేలం పాటలు నిర్వహించారు. పలువురు భక్తులు పోటీపడి దక్కించుకున్నారు. స్వామి వారి ప్రసాదం అందడం తమ అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు. మండపం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తులకు పంపిణీ చేశారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో ఈ పరిస్థితి కనిపించడం విశేషం.

లింగిరెడ్డిపల్లెలో రూ.2.35 లక్షలు



ఒబులవారిపల్లె : మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ లింగిరెడ్డిపల్లె గ్రామంలో లడ్డూ రూ. 2.35 లక్షలు పలికింది. గ్రామానికి చెందిన చింతరాచపల్లి సుబ్బరాయుడు దక్కించుకున్నారు.

అనంతంపల్లిలో రూ.70 వేలు



పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలో గణనాథుని లడ్డూ రూ.70 వేలు పలికింది. అనంతంపల్లి గ్రామానికి చెందిన సూరపురాజు చెంగమ్మ దక్కించుకున్నారు.

త్రిపురవరంలో రూ.2 లక్షలు



ఖాజీపేట : మండలంలోని త్రిపురవరం గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా లడ్డూ వేలం పాట జరిగింది. పాలగిరి ఓబుల్‌రెడ్డి రూ.2 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. ఇప్పటి వరకు మండలంలో ఇదే అత్యధిక రేటు కావడం విశేషం.

సీతారాంపురంలో రూ.1.55 లక్షలు



రాజంపేట రూరల్ : మండలంలోని సీతారాంపురంలో రూ.1.55 లక్షలకు గణేష్ లడ్డూను మల్లు రాజులరెడ్డి దక్కించుకున్నారు. కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాటవారిపల్లెలో రూ.75 వేలు



పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్ల పంచాయతీ బాటవారిపల్లెలో లడ్డూ రూ.75 వేలకు సానక్కగారి సుధాకరరెడ్డి, మరో చిన్న లడ్డూను యర్రగొర్ల ఓబులేసు రూ.30 వేలకు కైవసం చేసుకున్నారు. అలాగే రెడ్డివారిపల్లె దళితవాడలో శ్రీరాములు రూ.38 వేలకు దక్కించుకున్నారు.

పెద్దదండ్లూరులో రూ.1.32 లక్షలు



జమ్మలమడుగు : మండల పరిధిలోని పెద్దదండ్లూరులో వినాయకుడి లడ్డూను రూ.లక్షా 32 వేలకు మెరువు బ్రదర్స్, వరప్రసాద్‌రెడ్డి వశం చేసుకున్నారు.

లక్కిరెడ్డిపల్లిలో రూ.70 వేలు



చింతకొమ్మదిన్నె : మండలంలోని లక్కిరెడ్డిపల్లి గ్రామంలో లడ్డుతోపాటు, చెరుకుగడలను రూ.70 వేలకు అదే గ్రామానికి చెందిన బిల్లా రమణ దక్కించుకున్నారు.